
క్లుప్తంగా

తిరుపతి మరణాలను ఎవరి ఖాతాలో వేస్తారు?



పెనుగంచిప్రోలు: తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన భక్తుల మరణాలను ఎవరి ఖాతాలో వేస్తారని వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ విమర్శించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులకు కనీసం దర్శనం టికెట్లు అందించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని, సనాతన ధర్మం అని భారీ డైలాగ్‌లు చెప్పే పవన్‌కల్యాణ్ భక్తుల మరణాలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యలు ఆయన బాధ్యతా రాహిత్యాన్ని తెలియజేస్తున్నాయన్నారు. తక్షణం ఆయన రాజీనామా చేయాలన్నారు. జరిగిన సంఘటనపై తక్షణమే కమిటీవేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

పెనుగంచిప్రోలు: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ముగ్గులు వేయటంతో పాటు హరిదాసు వేషధారణలతో ఆకట్టుకున్నారు. పొంగళ్లు చేసి, భోగిమంటలు వేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.జలజ, సీహెచ్ రామారావు, గింజుపల్లి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా మాదల

పెనుగంచిప్రోలు: మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా మాదల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ప్రెస్‌క్లబ్ సమావేశంలో అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిగా బోళ్ల రవికుమార్, ఉపాధ్యక్షుడిగా కాకాని రవి, గౌరవాధ్యక్షుడిగా బత్తుల వెంకట్రామయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముమ్మాటికీ కూటమి ప్రభుత్వ హత్యలే

కంచికచర్ల: తిరుపతి దుర్ఘటన ముమ్మాటికీ కూటమి ప్రభుత్వ హత్యలే అని ఎంపీటీసీ సభ్యుడు, బీఎస్పీ నాయకుడు బర్రె ఉదయ్‌కిరణ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, క్షతగాత్రులకు వారి తీవ్రతను బట్టి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

350 మందికి వైద్య పరీక్షలు

కంచికచర్ల: కంచికచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు ఆసుపత్రిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా జిల్లా లయన్స్ గాట్ వైస్ చైర్మన్ చెన్నమనేని శ్రీనివాసరెడ్డి, జిల్లా లయన్స్ జీఎల్‌టీ కోఆర్డినేటర్ ఎన్‌వీవీఎస్‌వి ప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో విజయవాడకు చెందిన ఆంధ్ర ఆసుపత్రి వైద్యుడు అచ్యుతబాబు, అమరావతి కంటి ఆసుపత్రి వైద్యులు, దుహిత డెంటల్ ఆసుపత్రి వైద్యులు పాల్గొని 350 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారని లయన్స్‌క్లబ్ గౌరవ సభ్యుడు డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు తెలిపారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

వీరులపాడు: ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకు సాగితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంఈవో పాల్ కెనడీ అన్నారు. మండలంలోని జయంతి గ్రామంలోని ఎస్‌వీఆర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు గురువారం పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించటంతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు అందించారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

జగ్గయ్యపేట: గోకులం షెడ్డు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో నితిన్ అన్నారు. మండలంలోని తిరుమలగిరి, జయంతిపురం ధర్మవరప్పాడుతండా గ్రామాల్లో పూర్తయిన గోకులం షెడ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 27 గోకులం షెడ్లు మంజూరవగా 15కు పైగా పూర్తయ్యాయన్నారు. ఈ నెల చివరి లోగా మిగిలినవి కూడా పూర్తి చేసేలా ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలకు కరదీపికల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సమాఖ్య వీవోఏలకు అక్షర వెలుగు కరదీపికలను ఎంపీడీవో నితిన్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళల కోసం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా శిక్షణ ఇచ్చామన్నారు. గ్రామాల్లోని చదువురాని డ్వాక్రా మహిళలకు చదువు చెప్పాల్సిన బాధ్యత వీవోఏలపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వరరావు, ఎంఈవో చిట్టిబాబు, సీఆర్పీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ముగిసిన సదస్సులు

- నియోజకవర్గంలో మొత్తం 857 దరఖాస్తులు
- దీర్ఘకాలిక సమస్యల జోలికి వెళ్లని అధికారులు
- ప్రచార ఆర్భాటమే తప్ప పరిష్కరించినవి స్వల్పం



జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేట సదస్సులో అర్జీ అందిస్తున్న రైతులు(ఫైల్)

జగ్గయ్యపేట: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు సాదాసీదాగా జరిగాయి. కొన్ని గ్రామాల్లో సదస్సులకు అధికారులు, సిబ్బంది తప్ప రైతులు ఆసక్తి చూపలేదు. నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో గత ఏడాది డిసెంబరు ఆరు నుంచి ఈ ఏడాది జనవరి 8వ తేదీ వరకు అధికారులు మొత్తం 65 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో కేవలం రెవెన్యూపరమైన సమస్యలపై 857 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 189 దరఖాస్తులు మాత్రమే పరిష్కరించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరో 668 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. భూ సమస్యలు అధికంగా ఉండటంతో పాటు సర్వే కొలతల వ్యత్యాసం, అడంగల్ మార్పులు, పట్టాదారు పాసు పుస్తకాలు, పేర్ల మార్పిడి, ఆక్రమణలు, వారసత్వం, తదితర సమస్యలపై పలువురు దరఖాస్తులు అందించారు. ఈ సదస్సుల్లో రైతులకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదనే విమర్శలు నెలకొన్నాయి. చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చిన అధికారులు దీర్ఘకాలిక సమస్యల జోలికి అసలు వెళ్లలేదని అంటున్నారు.

సాదాసీదాగా సదస్సులు...

గత 32 రోజులుగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు తూతూమంత్రంగానే జరిగాయి. కొన్ని గ్రామాల్లో పెద్ద సమస్యలున్నా అధికారులు పరిష్కరిస్తామని చెప్పి దాటవేత ధోరణి చూపారని రైతులు అంటున్నారు. దేవదాయ, అటవీ శాఖలతో పాటు రెవెన్యూ సిబ్బంది సదస్సుల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రేషన్ కార్డులు, పింఛన్లు తదితర సమస్యలపై దరఖాస్తులు అందించినా ఈ సదస్సులు కేవలం రెవెన్యూ పరమైన సమస్యలకే అని అధికారులు చెప్పటంతో అర్జీదారులు నిరాశతో వెనుదిరిగారు. సదస్సుల్లో వచ్చిన అర్జీలకు కొన్ని గ్రామాల్లో రశీదులు ఇవ్వగా, మరికొన్ని గ్రామాల్లో ఇవ్వలేదని, ఎందుకు ఇవ్వలేదని అడగ్గా వీఆర్వోలు ఇస్తారని అధికారులు చెప్పటం గమనార్హం.

నాలుగో వంతు దరఖాస్తులు కూడా పరిష్కారం కాలేదు

జగ్గయ్యపేట మండలంలో 19 రెవెన్యూ గ్రామాలుండగా 311 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 79 దరఖాస్తులను పరిష్కరించగా 232 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వత్సవాయి మండలంలో 27 రెవెన్యూ గ్రామాలుండగా 453 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 110 దరఖాస్తులను పరిష్కరించగా 343 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పెనుగంచిప్రోలు మండలంలో 17 రెవెన్యూ గ్రామాలుండగా 93 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం అన్ని దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం.

పేదవాడి ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పేదవాడి ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేడు అనారోగ్యంతో ఆసుపత్రికి వెళితే ఆరోగ్యశ్రీ కింద అడ్మిట్ చేసుకుంటారో లేదో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రైవేటు ఇన్సూరెన్స్ ఫెయిల్యూర్ మోడల్ అని, కొన్ని రాష్ట్రాల్లో ఈ విధానాన్ని రద్దు చేసుకున్నాయని, ఈ విధానాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.5 లక్షల ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి ప్రొసీజర్స్‌ను, నెట్‌వర్క్ హాస్పిటల్స్‌ను పెంచారన్నారు. నేడు నెట్‌వర్క్ ఆస్పత్రుల సేవలు నిలిపివేసే దుస్థితికి కూటమి ప్రభుత్వం తెచ్చిందన్నారు. వెంటనే ఆరోగ్యశ్రీని యథాతథంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

జగ్గయ్యపేట: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గండ్రాయి, ధర్మవరప్పాడుతండా, బలుసుపాడు, అన్నవరం గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో భోగి మంటలు, విద్యార్థుల రంగవల్లులు, గాలి పటాలు ఎగరవేయటం, భోగి పళ్ల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గండ్రాయి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నేలవెల్లి రమేష్ హరిదాసు వేషధారణ ఆకట్టుకుంది.



ధర్మవరప్పాడుతండ పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు

ముగిసిన రెవెన్యూ సదస్సులు

- 434 దరఖాస్తులకు 216 పరిష్కారం..
- పెండింగ్‌లో 218 దరఖాస్తులు..

నందిగామ టౌన్: రైతుల భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ముగిశాయని తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుల్లో మొత్తం 434 దరఖాస్తులు అందాయన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు, అడంగల్ సవరణలకు సంబంధించి 326 దరఖాస్తులు రాగా భూముల సర్వే చేయాలని కోరుతూ 108 దరఖాస్తులు అందాయని తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు, అడంగల్ సవరణలకు సంబంధించి 179 దరఖాస్తులను పరిష్కరించగా 147 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. భూ సర్వేలకు సంబంధించి 37 దరఖాస్తులు పరిష్కరించగా మరో 71 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు.

కోడి పందేల బరి ధ్వంసం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో బరులు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారంతో గురువారం సిబ్బందితో వెళ్లి ధ్వంసం చేశారు. అనుమంచిపల్లి గ్రామంలోని బరిని కూడా ధ్వంసం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు మంగ్యానాయక్, అబ్రహం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



జగ్గయ్యపేట అర్బన్: ఈ నెల 7,8 తేదీలలో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనపరచి ఈ నెల 20 వ తేదీ నుంచి పాండిచ్చేరిలో జరిగే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనేందుకు ఎంపికైన జగ్గయ్యపేటకు చెందిన జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులను గురువారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అభినందించారు. పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థులు ఎం.నాగతేజ, వై.భార్గవ ధనుష్, గైడ్ టీచర్ జి.చంద్రశేఖర్, హెచ్ఎం మాధవీలతను ఎమ్మెల్యే తాతయ్యను ఆయన నివాసంలో కలవగా వారిని అభినందించారు.

సత్యమ్మ అమ్మవారికి రూ.6.19 లక్షల ఆదాయం

అంబారుపేట(నందిగామ టౌన్): సత్యమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రెండు నెలలకు గాను రూ.6.19 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో హరిగోపీనాథ్ తెలిపారు. మండలంలోని అంబారుపేట గ్రామంలోని ఆలయ ఆవరణలో గురువారం హుండీ కానుకలను లెక్కించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, శివ దుర్గాసాయి సేవా సమితి సభ్యులు, గ్రామ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆలయాలలో ఉత్తర ద్వార దర్శనం

జగ్గయ్యపేట: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని తిరుమలగిరి గ్రామంలోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఉత్తరద్వార దర్శనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీ వరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని రంగనాయక స్వామి, కొత్త, పాత వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలను అధికారులు ఉత్తర ద్వార దర్శనానికి సిద్ధం చేశారు. పట్టణంలో కొట్టాయం ఉత్సవానికి సిద్ధం చేశారు.

యువతలో స్ఫూర్తి నింపిన స్వామి వివేకానంద

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవతావాది, తత్వవేత్త స్వామి వివేకానంద ప్రతి మాట యువతలో స్ఫూర్తి నింపేదేనని పలువురు అతిథులు పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ యువజనోత్సవ కార్యక్రమం గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం జరిగింది. కార్యక్రమానికి పాఠశాల సహాయకులు వేదాంతం శ్రీనివాసు, ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగి పి.బాలగంగాధర్, న్యాయవాది కేజేఎస్ ప్రకాష్ అతిథులుగా హాజరయ్యారు. తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాన్ని రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, దారా నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూచిపూడి తరుణ్ బాబు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



పొన్నవరం(వీరులపాడు): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామ సమీపంలోని ఏకత్వ పాఠశాల ఆవరణలో గురువారం సంక్రాంతి పండుగ సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు వేసిన రంగవల్లులను ఆమె పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు.
కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు అరనేని మనోజ్, రమేష్‌బాబు, సింధూర, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

నందిగామ టౌన్: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని చందాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లుల పోటీలు, గాలిపటాలు తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా హరిదాసు, తదితర సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

పెద్దాపురం(వీరులపాడు): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావటం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని ఏహెచ్ యూపీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో రూ.5.50 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ, ప్రధాన గేటుతో పాటు విద్యార్థులకు రక్షిత మంచినీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్ తదితర పనులు చేపడుతున్నామన్నారు. అనంతరం ఆర్థిక సహకారం అందిస్తున్న పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి పసుపులేటి పుల్లారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో గురువారం విశ్రాంత ఉద్యోగుల డైరీని జగ్గయ్యపేట సబ్ ట్రెజరీ ఆఫీసర్(ఎస్‌టీవో)ప్రఫుల్ల కుమార్ ఆవిష్కరించారు. అనంతరం మ్యాక్స్ విజన్ కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించగా 50 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

రాజకీయ వేధింపులు మానుకోవాలి

వీరులపాడు: మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుప్రజ అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు, మెను చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ మండల అధ్యక్షురాలిగా పార్వతి, కార్యదర్శిగా పుల్లమ్మతో పాటు నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సోమేశ్వరరావు, గౌస్, కౌలు రైతు సంఘం నాయకుడు చాట్ల రవి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

నందిగామ టౌన్: వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు మండలంలోని వైష్ణవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ముక్కోటి ఉత్సవ కమిటీ ప్రతినిధి దివి వెంకట రత్నమాచార్యులు తెలిపారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్

పోచంపల్లి(జగ్గయ్యపేట): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ఎండగడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పిలుపునిచ్చారు. గ్రామంలో గురువారం రాత్రి నూతనంగా ఎన్నికైన గ్రామ పార్టీ కన్వీనర్ బూతుకూరి కొండారెడ్డి అధ్యక్షతన గ్రామ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన ఆరు నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. గద్దెనెక్కాక మొండి చేయి చూపడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే సుపరిపాలన అందిస్తామని చెప్పిన నేతలు వచ్చిన తరువాత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనటానికి గ్రామ స్థాయి కార్యకర్తల నుంచి ప్రజా ప్రతినిధులపై మోపిన అక్రమ కేసులే నిదర్శనమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరు వెళ్లినా పార్టీకి ఎటువంటి నష్టం లేదన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పార్టీ ఆధ్వర్యంలో నిత్యం పోరాటం చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉంటానన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లాగా పని చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్నా) మాట్లాడుతూ మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్‌గా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. అనంతరం గ్రామ పార్టీ కన్వీనర్ కొండారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల, పట్టణ కన్వీనర్‌లు బూడిద నరసింహారావు, వట్టెం మనోహర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ నాయకులు కన్నమాల శామ్యూల్, బద్దు నాయక్, శ్రీనివాసగౌడ్, జిల్లా నాయకులు చింతకుంట్ల వెంకటరెడ్డి, వేముల మల్లేశ్వరరావు, గ్రామ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన అనంతరం కొండారెడ్డిని సత్కరిస్తున్న దేవినేని అవినాష్ , పక్కన సమన్వయకర్త తన్నీరు, వేల్పుల, ఇంటూరి తదితరులు

మృతుల కుటుంబాలకు రూ.కోటి అందజేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పవిత్ర పుణ్యక్షేత్రం అయిన తిరుపతిలో తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పలువురు పార్టీ నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. టీటీడీ ఆలయ ఈవో, చైర్మన్, అధికారుల తప్పిదం వలనే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. సర్వదర్శనం టోకెన్ల కోసం సాయంత్రం నుంచే భక్తులను నిలబెట్టి ఉంచి ఒకేసారి గేటు తెరవడం వలన ఈ సంఘటన జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసి దర్యాప్తు చేయించాలని సూచించారు. ఘటనకు బాధ్యులైన వ్యక్తులను, అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ మాట్లాడుతూ టీటీడీ నిర్లక్ష్యం వలన ఉదయం ఇవ్వవలసిన టోకెన్లు రాత్రి 9 గంటలు అయినా ఇవ్వకపోవడంతో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగిందని, సరైన పోలీస్ భద్రత లేకపోవడంతో ఈ దుర్ఘటన జరిగిందన్నారు. దీనిపై తగిన విచారణ చేయించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎల్.బద్దూనాయక్, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు శామ్యూల్ కన్నమాల, విజయవాడ కనకదుర్గమ్మ గుడి డైరెక్టర్ నంబూరి రవి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు

టీటీడీ పాలకవర్గాన్ని తక్షణం రద్దు చేయాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల

పెనుగంచిప్రోలు: భక్తుల విలువైన ప్రాణాలు పోవటమే కాకుండా, పెద్ద ఎత్తున గాయపడిన ఘటనకు సంబంధించి ప్రభుత్వం టీటీడీ పాలకవర్గాన్ని తక్షణం రద్దు చేయాలని, నెడ్ క్యాప్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా కేవలం పాలకవర్గం, అధికారులు ముందస్తు భద్రతాచర్యలు తీసుకోక పోవటం వలనే ఈ దుర్ఘటన జరిగిందన్నారు. ఈ ఘటనకు టీటీడీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, దేవదాయ శాఖా మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన వారికి ఒక్కొక్కరికి రూ.కోటి, గాయపడిన వారికి ఒకొక్కరికి రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. జరిగిన ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలి

వీరులపాడు: అధికారులు గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు ఒక్కో ఎంపీటీసీ సభ్యునికి రూ.రెండు లక్షలు, ఆయా గ్రామాల్లో బోర్లు ఏర్పాటుకు రూ.63.50 లక్షలను మంజూరు చేస్తామని చెప్పారు. ఎంపీడీవో అరుంధతీ దేవితో కలసి అసాంఘిక క్రీడల నిషేధంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నాగుల్ మీరా, వేమూరి ఆదాం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైద్యాధికారులు దీపిక, గౌతమ్, ఎంఈవో కెనడి తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

విద్యా సంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



పేట విజ్ఞాన్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, డైరెక్టర్ తన్నీరు సుధారాణి, ఉపాధ్యాయులు



పేటలోని నాగార్జున హైస్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సంక్రాంతి పండుగ సంబరాలు పట్టణంలో పలు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించి శుభాకాంక్షలు తెలిపారు.

-జగ్గయ్యపేట అర్బన్